క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



తిరుపతి మంగళం: వేసవిలో మండుతున్న ఎండలకు తాగునీటిని అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కె బాబు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం సిద్ధి వినాయక ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొటూరు ఆంజనేయులు, యూనియన్ నాయకులు ఇస్మాయిల్ బాయ్, వెంకటేశ్వర్లు, నజీర్, ఆటో ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ పరిశీలన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రదీప్ కుమార్, జ్ఞానశేఖర్ రెడ్డి

తిరుపతి రూరల్: నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీపురం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శ్రమదాన్ శివిర్ కార్యక్రమంలో భాగంగా సమాజానికి ఉపయోగపడే వనరులను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేయడం కోసం నెహ్రూ యువ కేంద్రం కొంత భాగం నిధులను అందజేస్తోందని తెలిపారు. మాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 20 లీటర్ల శుద్ధి చేసిన నీటిని రూ.రెండుకే ప్రజలకు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి, రాజేష్ యువత పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని డ్వాక్రా మహిళలకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని జగనన్న సమావేశ మందిరంలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేయనున్నట్టు ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కు అందజేస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు



తిరుపతి మంగళం : మంగళం సమీపంలోని సర్వేనెంబర్ 195 లో కోళ్ల ఫారాలు సాయి చటర్జీ నగర్ వద్ద ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎన్టీఆర్ హయాంలో కోళ్లఫారాల నిర్మాణం కోసం ఎస్సీలకు భూములు కేటాయించారు. అక్కడే కొంత మిగులు భూమి కూడా ఉంది. ఈ స్థలంలో రెండు రేకుల షెడ్లను నిర్మించారు. తాము ఎప్పటినుంచో ఇక్కడ నివాసం ఉంటున్నామని, గతంలో కురిసిన వర్షాలకు గుడిసెలు పడిపోవడంతో రేకుల షెడ్లు నిర్మించుకుంటున్నామని వారు అంటున్నారు. తమ ఇళ్లకు పట్టాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆ స్థలం అక్రమమో.. సక్రమమో తేల్చాల్సి ఉంది.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో 4 సీట్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు.

నేడు వాహనాల వేలం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో శుక్రవారం వాహనాలను వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ పి.టి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పరిధిలో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ వేలంలో వేయనున్నట్లు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగిన వారు నిర్దేశించిన ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు శ్రీకాళహస్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సీతారాముల కల్యాణం.. వైభోగం





కోదండరామస్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు, హనుమంత వాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం ఊంజల్ మండపంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయుడి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. తదుపరి శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు పెద్దజీయంగార్ మఠం నుంచి అర్చకులు నూతన వస్త్రాలు తీసుకొచ్చి సమర్పించారు. తర్వాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ చేశారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీరామచంద్రమూర్తి హనుమంత వాహనాన్ని అధిష్టించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



స్నపన తిరుమంజనంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి



తిరుపతి: సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామికి స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు



భాకరాపేట: సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు



వడమాలలతో అలంకరించిన ఆంజనేయస్వామి

భక్తులకు మజ్జిగ, పానకం వితరణ

కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. రాములవారి గుడి సన్నిధి వీధిలోని బ్రాహ్మణ సమాజం కార్యాలయంలో రాముల వారి చిత్రపటానికి పూజలు చేశారు. సాయంత్రం భజనలు చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, మనోహర్, కొత్తపల్లి విజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, నరసింహాచార్య, ప్రసాద్, సురభి మురళి, మురళీధర్ శర్మ, నటరాజ స్వామి పాల్గొన్నారు.



భక్తులకు వడపప్పు, పానకం, మజ్జిగ వితరణ చేస్తున్న బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

రంగస్థలి ఆధ్వర్యంలో..

తిరుపతి గాంధీ రోడ్: శ్రీరామనవమి సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గోవిందరాజ స్వామి ఆలయం వద్ద పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం యాదవ్, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, కేఎన్ రాజా, మల్లారపు, వరప్రసాద్, తొండమనాడు సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.



పానకం పంపిణీ చేస్తున్న రంగస్థలి ప్రతినిధులు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

తిరుపతి కల్చరల్: సంజయ్ గాంధీ కాలనీలోని శ్రీరాముడి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి వేదికపైకి వేంచేపు చేశారు. మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ముని సుబ్రమణ్యం దంపతులు, వైఎస్సార్ సీపీ నేతలు ఆదం సుధాకర్‌రెడ్డి, రవిచంద్ర, మురళి యాదవ్, సుబ్బు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండలంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చంద్రగిరిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తలకు దర్శనం కల్పించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్లు, తోరణాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

శ్రీవారిమెట్టులో...

శ్రీవారిమెట్టు మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని 30 వేల వడలతో అలకరించారు. ఆలయ ఆవరణలో శ్రీసీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అదే విధంగా చంద్రగిరి కోట గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి, ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి ఆలయ అనుబంధ సీతారామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

భాకరాపేటలో..

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీతారాముల కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను వాహనాలపై కొలువుదీర్చి ఊరేగించారు.

స్విమ్స్‌లో చైర్ ఓరియేషన్ విజయవంతం

తిరుపతి తుడా: స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 8వ చైర్ ఓరియేషన్ కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో కేరళ రాష్ట్రం తిరువనంతపురం శ్రీచిత్రతిరునార్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌బిహారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన బయో ఎథిక్స్ ఇన్ మెడిసిన్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చరణ్ బిసింగ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వివి రమేష్‌చంద్ర పాల్గొన్నారు.



చైర్ ఓరియేషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మందుల తయారీ కేంద్రం పరిశీలన



మందుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నిర్మించిన మందుల తయారీ కేంద్రాన్ని గురువారం టీటీడీ జేఈవో సదా భార్గవి పరిశీలించారు. దాన్ని శుక్రవారం ఉదయం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జేఈవో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ హరనాథ రెడ్డి, ఈఈలు మనోహర్, మురళీకృష్ణ, డీఈ సరస్వతి, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి నారపరెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వెలుపల జస్టిస్ వి.సుజాత

తిరుచానూరు(చంద్రగిరి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు గురువారం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ మధు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐ రామ్మోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న సేవలో జస్టిస్ వి.సుజాత

హైకోర్టు జడ్జి జస్టిస్ వి.సుజాత గురువారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటస్వామి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా జస్టిస్ సుజాత కాణిపాకం వెళ్లి వరసిద్ధి వినాయక స్వామిని కూడా దర్శించుకున్నారు.

సీసీఎస్ సమావేశం నిర్వహణపై ఆరోపణలు తగదు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ రాష్ట్ర స్థాయి సీసీఎస్ పాలక మండలి సర్వసభ్య సమావేశం రెండు రోజుల క్రితం సక్రమంగా నిర్వహించామని, దీనిపై కొందరు ఉద్యోగుల ఆరోపణలు తగదని ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు తెలిపారు. సమావేశానికి ఖర్చు చేసిన ప్రతి పైసాకు లెక్కలున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు



వీరభద్రస్వామి ఆలయంలో బాలాలయ పూజలు



చల్లేశ్వరస్వామి ఆలయంలో బాలాలయ పూజల్లో అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో



చక్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలైన వీరభద్రస్వామి ఆలయం, వేడాంలోని కాలభైరవస్వామి, ఆలయం పట్టణంలోని చల్లేశ్వర స్వామి ఆలయం, చక్రేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్ప పూజలు, కలశ పూజలు హోమ పూజలు నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ అభిషేక గురుకుల్, నిరంజన్‌గురుకుల్, పాలకమండలి సభ్యులు పసల సుమతి, ఆలయ వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ట్రాఫిక్ కష్టాలు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు కొద్దిరోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. బస్టాండ్ నుంచి బస్సును బయటకు తీయాలంటే డ్రైవర్లు నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో బస్సు బయటకు రావడానికి 30 నుంచి 40 నిమిషాలు పడుతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందికి గురవుతున్నారు. కొందరు డ్రైవర్లు బస్సులను అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతోనే ఈ సమస్య నెలకొంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్కకు తీయాలని అడిగే డ్రైవర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఉదాసీనంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

చంద్రగిరి: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో గురువారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం దేవేరులను సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.45 నుండి 8.15 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల రామనామస్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై అధిష్టింపజేశారు. కార్యక్రమంలో కంకణ భట్టార్ శ్రీనివాస భట్టార్, డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన హరికథా సప్తాహ యజ్ఞం



హరికథా గానం చేస్తున్న భాగవతారిణి

తిరుపతి కల్చరల్: టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన హరికథా సప్తాహ యజ్ఞం గురువారం ఘనంగా ముగిసింది. ఇందులో ప్రముఖ భాగవతారిణి జయంతి సావిత్రి రామాయణ హరికథను గానం చేశారు. రామాయణంలోని అన్ని ఘట్టాలను రాగయుక్తంగా గానం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆమె టీటీడీలో 30 ఏళ్లకుపైగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తదితర అధికారులు, ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. ఆకెళ్ల విభీషణ శర్మ మాట్లాడుతూ భాగవతారిణి సావిత్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆమె ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. హరికథా కథక రాజహంస, హరికథా సంగీత భారతి, హరికథా రత్న, హరికథా చూడామణి వంటి బిరుదులు అందుకున్నారని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి



మహద్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పి.అంజయ్య, గొడుగు చింత గోవిందయ్య

తిరుపతి కల్చరల్: ప్రముఖ రచయిత్రి డాక్టర్ నిర్మల యార్లగడ్డ తెలుగులోకి అనువాదం చేసిన మహద్ పుస్తకాన్ని గురువారం ఎంఆర్ పల్లిలోని ఆర్పీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి గొడుగు చింత గోవిందయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ 1927లో ముంబయి నగరంలోని మహద్ చెరువులో దళితులు తాగునీరు తీసుకోకుండా నిషేధించారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మొదటిసారి మహద్ చెరువు పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటం నేటికీ కొనసాగుతోందని గుర్తుచేశారు. ఈ మహద్ చెరువు పోరాటాన్ని ఉద్యమ నేత బొజ్జాతారకం 2011లో ఆంగ్లంలో రచించారని పేర్కొన్నారు. దీన్ని ప్రముఖ రచయిత్రి డాక్టర్ నిర్మల యార్లగడ్డ తెలుగులోకి అనువాదం చేశారని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ నేత సదాశివం, దళిత దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం కాళయ్య, సామాజిక ఉద్యమ నేత సంగీతం విశ్వనాథం, ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు ఎ.సుబ్రమణ్యం, బొజ్జాతారకం కాలనీ అధ్యక్షుడు మేకల బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సంకెళ్లను తెంచుకుంటూ' పుస్తకావిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ జిల్లా జడ్జి గురప్ప, సిద్ధోజీరావు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు ఆత్మకథగా వెలువడిన సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆవిష్కరించనున్నట్టు విశ్రాంత జిల్లా జడ్జి పి.గురప్ప, ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ ఫోరం కన్వీనర్ సిద్ధోజీరావు తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కాకి మాధవరావు ఐఏఎస్ అధికారిగా సుదీర్ఘ కాలం సేవలు అందించారని తెలిపారు. హైదరాబాద్‌లో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, కేబీఆర్ పార్క్, ఏపీ స్టడీ సర్కిల్, రెసిడెన్సియల్ పాఠశాలల ఏర్పాటులో ఆయన కృషి చాలా ఉందని తెలిపారు. సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకంలో తను పాలేరు నుంచి చీఫ్ సెక్రటరీగా ఎలా ఎదిగారో కాకి మాధవరావు వివరించారని తెలిపారు. ఈ పుస్తకం నేటి విద్యార్థులకు, భావితరాల వారి లక్ష్య సాధనకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు, బహుజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో అంబేడ్కర్ ఆర్మీ నేత డాక్టర్ గోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు ఎం.ప్రసాద్‌రావు, జె.భాస్కర్, గాలి సుధాకర్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధి గిరి, సురేష్, రమేషబాబు క్రిష్ణమూర్తి, బి.శ్రీనివాసులు, సీనియర్ జర్నలిస్టు నాగరాజు పాల్గొన్నారు.